




కొత్తూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీవో పీడీ శ్రీనివాస్



వికారాబాద్ జిల్లా కోర్టు భవన సముదాయం (కోర్టు కాంప్లెక్స్) నిర్మాణానికి శరవేగంగా అడుగులు పడుతున్నాయి. పెరిగిన కోర్టులకు అనుగుణంగా సరిపడా మౌలిక వసతులు లేకపోయినా న్యాయమూర్తులు, మెజిస్ట్రేట్లు, న్యాయవాదులు, సిబ్బంది ఇబ్బందులు పడుతూ విధులు నిర్వహిస్తున్నారు. కొత్త జిల్లాలు ఏర్పాటైన తర్వాత ప్రతి జిల్లాలోనూ కోర్టు కాంప్లెక్స్‌లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వచ్చే రెండు దశాబ్దాల అవసరాలకు అనుగుణంగా అన్ని సదుపాయాలతో ఈ కాంప్లెక్సుల నిర్మాణం చేపట్టనున్నారు. న్యాయ నిర్మాణ్ ప్రణాళిక కింద రాష్ట్రంలో 12 జిల్లాల్లో కోర్టు కాంప్లెక్స్‌ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించగా, ఇందులో వికారాబాద్ జిల్లాకు కూడా చోటు కల్పించారు. జిల్లాలో కోర్టు కాంప్లెక్స్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.81 కోట్లు కేటాయించింది. ఈ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం టెండర్లు కూడా పిలిచింది.

- వికారాబాద్, మే 14(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)



రాజసం ఉట్టిపడేలా..

వికారాబాద్‌లో నయా కోర్టు కాంప్లెక్స్

- నాలుగు అంతస్తుల్లో 12 హాళ్లతో నిర్మాణం
- అవసరమైతే 2 ఫ్లోర్లు పెంచుకునే అవకాశం
- అత్యాధునిక హంగులతో వసతుల కల్పన
- రూ.81 కోట్లు కేటాయించిన ప్రభుత్వం



వికారాబాద్‌లో జిల్లా కోర్టు భవన సముదాయం

వికారాబాద్‌లో ప్రస్తుతం కోర్టులు కొనసాగుతున్న స్థలంలోనే కోర్టు కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టనున్నారు. టెండర్లు ఖరారు కాగానే పనులు ప్రారంభించేలా సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలో సివిల్, క్రిమినల్, సైబర్ ఇతర కోర్టు కేసులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. వీటికి అనుగుణంగా వికారాబాద్‌లో జూనియర్, ఫస్ట్ క్లాస్, సీనియర్ సివిల్ జడ్జిలతోపాటు జిల్లా అదనపు జడ్జిల కోర్టులు ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వం పరిపాలనా సౌలభ్యం కోసం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాను వికారాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలుగా విభజించింది. ఉమ్మడి జిల్లా కోర్టులు ఎల్‌బీ నగర్‌లో కొనసాగుతుండగా వికారాబాద్‌లో జిల్లా అదనపు జడ్జి కోర్టు ఉండేది. అన్ని జిల్లాల్లోనూ జిల్లా కోర్టులు ఏర్పాటు చేయాలని 2 జూన్ 2022న గత ప్రభుత్వం వికారాబాద్‌లో ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు ఏర్పాటు చేసింది. జిల్లాకు సంబంధించిన కేసులను ఉమ్మడి జిల్లా కోర్టు నుంచి

మిగతా 8వ పేజీలో...

వికారాబాద్ పట్టణంలో నిర్మించనున్న జిల్లా కోర్టు కాంప్లెక్స్ భవన సముదాయాన్ని అత్యాధునిక హంగులతో తీర్చిదిద్దనున్నారు. నాలుగు అంతస్తుల్లో ఉండనున్న కోర్టు భవన సముదాయంలో మొత్తం 12 కోర్టు హాళ్లు నిర్మిస్తారు. జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి కోర్టుతోపాటు మరో 11 కోర్టులు ఏర్పాటు చేయనున్నారు. వివిధ కోర్టుల హాళ్లు, జడ్జిలు, మెజిస్ట్రేట్‌ల ఛాంబర్లు, కార్యాలయాలు, రికార్డు రూములు, వీపీల గదులు, బార్ అసోసియేషన్, గ్రంథాలయం,

అత్యాధునిక హంగులతో..

కక్షిదారుల కోసం హాళ్లు, క్యాంటీన్, పార్కింగ్ వంటి అవసరాల కోసం మొత్తం 2,18,743.58 చదరపు అడుగుల మేర స్థలం అందుబాటులో ఉండేలా నిర్మాణాలు చేపట్టనున్నారు. భవిష్యత్ అవసరాల కోసం అవసరమైతే మరో రెండు అంతస్తులు నిర్మించుకునేందుకు వీలుగా భవనాలను సిద్ధం చేయనున్నారు. ఈనెల 12తో టెండర్ దాఖలు చేసేందుకు గడువు ముగియగా, 15న టెండర్లు ఖరారు చేయనున్నారు. పనులు ప్రారంభించిన రెండేళ్లలోగా కోర్టు కాంప్లెక్స్ నిర్మాణాలను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.

రేపు శంకర్‌పల్లికి సుందరాంగులు

ఎకో టూరిజం పార్కు సందర్శన

- అరుదైన మొక్కలను తిలకించనున్న అందగత్తెలు
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

రంగారెడ్డి అర్బన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : శంకర్‌పల్లి మండలం పొద్దుటూరులోని ఎక్స్‌పీరియం ఎకో ఫ్రెండ్లీ పార్కులో ఈనెల 16న వివిధ దేశాల సుందరీమణులు సందడి చేయనున్నారు. ఆహ్లాదమైన వాతావరణాన్ని ఆస్వాదించడానికి రానున్నారు. ఏకో పార్కులో 85 దేశాల నుంచి సేకరించిన అంతర్జాతీయ వృక్షాలను వీక్షించనున్నారు. అరుదైన మొక్కలతో పాటు శిల్పకళా సంపదను తిలకించనున్నారు. 25వేల అరుదైన మొక్కలతో అలరిస్తున్న ఎక్స్‌పీరియంకు శుక్రవారం సాయంత్రం 5 గంటలకు అందగత్తెలు రానున్నారు. రాత్రి 7 గంటల వరకు ఎకో పార్కులో గడపనున్నారు. ఇందుకోసం రాష్ట్ర పర్యాటక శాఖ విస్తృత ఏర్పాట్లు చేస్తుంది. సుందరీమణులు సందర్శించే ప్రదేశాల్లో అధికారులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. రాత్రి వేళలో సందర్శిస్తున్న నేపథ్యంలో ఏకో పార్కులో కళ్లు మిరుమిట్లు గొలిపేలా లైటింగ్ ఏర్పాట్లు, ప్రత్యేక అలంకరణలు చేస్తున్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాలు

- పోస్టర్ ఆవిష్కరించిన మేడ్చల్ కలెక్టర్ గౌతం

ఘట్‌కేసర్ రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల ద్వారా అందిస్తున్న ఉచిత విద్య, హాస్టల్ వసతిని సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ పోట్రు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ప్రవేశాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మైనార్టీ గురుకులాల్లో పదో తరగతితోపాటు ఇంటర్మీడియట్ వరకు చదువుకునే అవకాశం ఉందన్నారు. జిల్లా పరిధిలోని ఎనిమిది గురుకుల పాఠశాలల్లో ఐదు నుంచి పదో తరగతితోపాటు ఇంటర్మీడియేట్‌లో ఎంపీసీ, బీపీసీ, ఎంఈసీ, సీఈసీ కోర్సుల్లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి కాంతమ్మ, మైనార్టీ విద్యాలయాల ఆర్‌ఎస్సీ జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

- డీఆర్‌డీవో పీడీ శ్రీనివాస్

బొంరాస్‌పేట్, మే 14 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బందులు కలిగించకుండా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని డీఆర్‌డీవో పీడీ శ్రీనివాస్ సూచించారు. బుధవారం మండలంలోని కొత్తూర్, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఉపాధిహామీ పనులు, ఫాంపాండ్ నిర్మాణం, చెక్ డ్యాంలను పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఐకేపీ కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. వర్షాలు కురుస్తుండటంతో రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యాన్ని తూకం వేసి వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. ఆయన వెంట డీఎస్‌వో మోహన్ బాబు, ఎంపీడీవో వెంకన్‌గౌడ్, ఏపీఎం సాయన్న ఉన్నారు.

సమాచారం

నేడు వికారాబాద్‌కు సీఎస్ రామకృష్ణారావు

వికారాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు గురువారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో పర్యటించనున్నారు. గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో జరిగే సమావేశంలో పాల్గొని జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలపై చర్చించనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఆయన ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఉదయం హైదరాబాద్ నుంచి నేరుగా నారాయణపేటకు వెళ్లనున్న ఆయన మధ్యాహ్నం వరకు అక్కడే ఉండి, ఆ తర్వాత వికారాబాద్ జిల్లా కేంద్రానికి రానున్నారు. అక్కడ కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించనున్నారు.



వికారాబాద్‌లో ఓ ఉమ్మడి కుటుంబం

కలిసుంటేనే కలదు సుఖం!

- ఆనందాలకు వేదిక ఉమ్మడి కుటుంబాలు
- రోజురోజుకూ విచ్ఛిన్నమవుతున్న ఫ్యామిలీలు
- కనుమరుగవుతున్న ప్రేమ, అనుబంధాలు
- కాలానుగుణంగా చిన్నదైపోతున్న కుటుంబం

నేడు ప్రపంచ కుటుంబ దినోత్సవం

ఒకప్పుడు ఉమ్మడి కుటుంబం అంటే ఆనందాలకు వేదికగా ఉండేది. ఇంటి నిండా కుటుంబ సభ్యులతో సందడి కనిపించేది. కలిసుంటే కలదు సుఖం అని అప్పట్లో ఎన్నో కుటుంబాలు నిరూపించాయి. కానీ రానురాను ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్నాయి. అన్నదమ్ముళ్లు, అక్కాచెల్లెళ్లు కలిసి ఉండేందుకు ఇష్టపడటం లేదు. అహం, స్వార్థం తదితర కారణాలతో వేరు కుటుంబాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో ఇంటి పెద్దలు అనాథలుగా మిగిలిపోతున్నారు.. పిల్లలు ఆప్యాయతలకు దూరం అవుతున్నారు.

దరఖాస్తులను పక్కాగా పరిష్కరించాలి

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్



కుక్కిందలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

ధారూరు, మే14(ఆంధ్రజ్యోతి): విమర్శలు, ఆరోపణలకు తావులేకుండా భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. మండల పరిధిలోని కేరెల్లి, కుక్కింద గ్రామాల్లో బుధవారం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులను సందర్శించి దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ధారూరు మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశామని, ఎక్కడ అవకతవకలు జరిగినా రెవెన్యూ వ్యవస్థకే చెడ్డ పేరు వస్తుందన్నారు. ఉద్దేశపూర్వకంగా తప్పిదాలకు పాల్పడితే బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సాదాబైనామా, పీవోటీ దరఖాస్తులకు సంబంధించి రికార్డుల పరిశీలన, సాధారణ విచారణ జరపాలని, హైకోర్టులో స్టే తొలగిన తర్వాతనే ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కరిస్తామని దరఖాస్తుదారులకు తెలియజేయాలని సూచించారు. గతంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం అధికారులే గ్రామాలకు వచ్చి సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తున్నారని తెలిపారు. అనంతరం అవుసుపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను, గట్టేపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్లు సాజిదా బేగం, శ్రీనివాస్, దీపక్, తదితరులు ఉన్నారు.

పొద్దంతా ఎండ.. సాయంత్రం వాన



తాండూర్ మండలం దస్తగిరిపేట్‌లో తడిసిన ధాన్యం బస్తాలు

కోట్‌పల్లి/నవాబుపేట/తాండూర్ రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): కోట్‌పల్లి మండల పరిధిలో బుధవారం పొద్దంతా ఎండ దంచికొట్టి.. సాయంత్రం భారీ వర్షం కురిసింది. రోడ్లపై వరద నీరు పారింది. ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. వేసవిలోనూ వర్షాకాలం తలపిస్తుండడంతో పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే నవాబుపేట మండలంలోని వట్టిమీనపల్లి, నవాబుపేట, చిట్టిగిద్ద, తిమ్మారెడ్డపల్లి, నాగిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ఈదురుగాలులతో కూడిన వర్షంతో మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాపై నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అలాగే తాండూర్ మండలంలో రాత్రి కురిసిన అకాల వర్షానికి అంతారం, దస్తగిరిపేట్, చెంగోల్, గోనూర్, వీరారెడ్డిపల్లి తదితర గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయ్యింది. ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరారు. కేంద్రాల దగ్గర సరైన వసతులు కల్పించలేదని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. నవాబ్‌పేటలో 24.5 మి.మీ., ధారూర్‌లో 11 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



సంకిరెడ్డిపల్లిలో ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న మహిళలు

ట్యాంకరొచ్చింది.. తండ్లాట తీరింది!

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాండూరురూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంకిరెడ్డిపల్లి, సంకిరెడ్డిపల్లి తండాలో నీటి సమస్యపై అధికారులు స్పందించారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో 'తాగునీటికి తండ్లాట' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ప్రత్యేకాధికారి ప్రణీత్ స్పందించారు. గ్రామాన్ని సందర్శించి సమస్యను తెలుసుకున్నారు. ట్యాంకర్ ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చారు. గ్రామంలోని చేతిపంపులకు మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకుంటామని, కొత్తగా మరో బోరు వేయిస్తామన్నారు. దారునివాగు తండా నుంచి సంకిరెడ్డిపల్లితండాకు సరఫరా అయ్యే బోరు మోటారుకు మరమ్మతులు చేస్తామన్నారు. అక్కడ కూడా ట్యాంకర్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. మిషన్ భగీరథ నీరు కూడా అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్ ఉన్నారు.

కర్ణాటక ధాన్యం తెలంగాణలోకి రావొద్దు

- వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి



కొత్లాపూర్ చెక్ పోస్టు వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

తాండూరురూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి ఒక్క ధాన్యం బస్తా కూడా తెలంగాణలోకి రాకుండా పోలీసులు చర్యలు చేపట్టాలని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశించారు. బుధవారం తాండూరు మండలంలోని కొత్లాపూర్ చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కర్ణాటక నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రాత్రి వేళల్లో అప్రమత్తంగా ఉండాలని, నిఘా పెంచాలని డీఎస్పీ బాలకృష్ణారెడ్డికి సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన బిల్లులను పరిశీలించాలన్నారు. అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకే బార్డర్ చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బక్రీద్ పండుగ సందర్భంగా పశువులు కర్ణాటక నుంచి తెలంగాణలోకి వచ్చే అవకాశం ఉందని, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎస్పీ వెంట రూరల్ సీఐ నగేష్, కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

పెద్దేముల్‌లో రికార్డుల పరిశీలన

పెద్దేముల్: పెద్దేముల్ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ నారాయణరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎస్ఐతో పెండింగ్ కేసులపై ఆరా తీశారు. శాంతి భద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కేసులను ఛేదించాలన్నారు. ఆయనవెంట తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, రూరల్ సీఐ నగేష్ ఉన్నారు.

డిస్పెన్సరీతో తొలగిన ఇక్కట్లు

- స్థానికంగానే ఆర్టీసీ కార్మికులకు వైద్యం
- వికారాబాద్‌లో డిస్పెన్సరీ ఏర్పాటు

8





చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

పేదలకు 'కల్యాణలక్ష్మి' వరం

శంషాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి) : కల్యాణలక్ష్మి పథకం పేదలకు వరంలాంటివని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని మండల తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు ఆయన అందజేశారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సుష్మా మహేందర్‌రెడ్డి, తహసీల్దార్ దత్తునాయక్, నాయకులు కె.మహేందర్‌రెడ్డి, నీరటి రాజు, శ్రీకాంత్‌గౌడ్, నర్కోడ శ్రీను, దౌనాకర్ గౌడ్, కృష్ణ, మహేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

ఆదిభట్ల, మే 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ పిలుపునిచ్చారు. బుధవారం ఇబ్రహీంపట్నం కేంద్రంలోని ఇంటర్నేషనల్ కంపెనీ వైట్‌గోల్డ్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 8 గంటల పని విధానాన్ని రద్దుచేసి 12 గంటల పని విధానాన్ని అమలు చేస్తుందన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.జగదీష్, జిల్లా సహాయ కార్యదర్శి స్వప్న, చింతపట్ల ఎల్లేష్, పోచమోని కృష్ణ, వీరేశం, శాంతమ్మ, పద్మ, బాలమణి, సుజాత తదితరులు పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న భూపాల్

గిరిజనుల ఆర్థికాభివృద్ధికి కృషి

- రూ.12,600 కోట్లతో 'ఇందిరగిరి సౌర జలవికాసం'
- పోడుభూముల్లో బోర్లు వేయించి సోలార్ పంపుసెట్ల అందజేత
- 18న మున్ననూర్‌లో పథకాన్ని ప్రారంభించనున్న సీఎం
- నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మల్లు రవి

ఆమనగల్లు, మే 14(ఆంధ్రజ్యోతి): గిరిజన, చెంచు రైతులకు పట్టాలిచ్చి పోడుభూములు సేద్యానికి యోగ్యంగా మలిచి.. వారి ఆర్థికాభివృద్ధికి బాటలు వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరగిరి సౌర జల వికాసం పేరిట కొత్త పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి తెలిపారు. రూ.12,600 కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసే ఈ పథకాన్ని ఈనెల 18న రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాగర్ కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని మున్ననూర్‌లో ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఆమనగల్లు పట్టణంలో బుధవారం మల్లు రవి పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లీ రాములు కార్యాలయంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ కేశవులుతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం గిరిజనోద్ధరణకు పెద్దపీట వేస్తుందన్నారు. ఇందిరగిరి సౌర జలవికాస్ పథకం కింద చెంచు, గిరిజనులకు లోగడ ఇచ్చిన పట్టాభూముల్లో బోర్లు వేయించి సోలార్ పంపు సెట్లను అందించనున్నట్లు వివరించారు. ఈ పథకానికి నీటి పారుదల, విద్యుత్, రెడ్కో, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, ఐటీడీఏల ద్వారా నిధులను కేటాయించి వినియోగించడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం చెంచు గిరిజనులను నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ఈ పథకానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు రవి తెలిపారు. అలాగే చెంచులకు ప్రత్యేకంగా 10 వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లీ రాములు, ఆమనగల్లు మున్సిపాలిటీ అధ్యక్షుడు మానయ్య, నాయకులు ఖాదర్‌ఖాద్రి, రాఘవేందర్, శ్రీనునాయక్, అంజినాయక్, కోట కృష్ణయ్య, బికుమాండ్ల రమేశ్, చంద్రయ్య, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

రోగుల ప్రాణాలను పణంగా పెట్టొద్దు

- కాసులకు కక్కుర్తి పడి హైదరాబాద్‌కు తరలింపా?
- అత్యాశతో రోగుల ప్రాణాలకు ముప్పు
- 108 అంబులెన్స్ సిబ్బందితో సమీక్షలో ఎమ్మెల్యే శంకర్



సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, మే 14(ఆంధ్రజ్యోతి): రోగుల ప్రాణాలను పణంగా పెట్టొద్దని, ప్రైవేటు ఆస్పత్రులు రోగుల పాలిట రాబందుల్లా మారాయని, కాసులకు కక్కుర్తిపడి అత్యవసర సమయాల్లోనూ వారిని హైదరాబాద్‌కు తరలిస్తారా? అంటూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ 108 అంబులెన్స్ సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో, హెల్త్ ఎడ్యూకేటర్ జర్కుల శ్రీనివాస్‌తో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా 108 సిబ్బంది అత్యవసర పరిస్థితుల్లోనూ ప్రైవేటు ఆస్పత్రులకు రోగులను తరలించడంపై మండిపడ్డారు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వారిని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి గానీ, అత్యవసర సమయాల్లో పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రులకు గానీ తరలించి ప్రాణాలు కాపాడాల్సి ఉంది. కానీ, హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు ఇచ్చే డబ్బుల కోసం అపస్మారక స్థితిలో ఉన్న పేషెంట్లను సైతం అంతదూరం తరలించడం మంచి పద్ధతి కాదన్నారు. అంబులెన్స్ కోసం ఫోన్లు చేసేది కేవలం పేద ప్రజానికమని, ఒక్కో పేషెంట్‌పై అంబులెన్స్ సిబ్బందికి రూ.4వేలు చెల్లిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు.

వైద్యులే రెఫర్ చేస్తున్నారు

ప్రతీ చిన్న రోగానికి కూడా తమవద్ద మందులు లేవంటూ ప్రభుత్వ వైద్యులే పేషెంట్లను తరచూ ఉస్మానియా ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నారని 108 సిబ్బంది ఎమ్మెల్యేకు వివరించారు. దాంతో రోగుల బంధువులు ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లాలని కోరుతున్నారని తెలిపారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మిని ప్రశ్నించారు. అనారోగ్యులు, రోడ్డు ప్రమాదాల బారినపడ్డ వారికి ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, బాల్‌రాజ్



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జైపాల్ యాదవ్, బాల్‌రాజ్

కడ్తాల్, మే 14(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలులో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమై ప్రజావిశ్వాసం కోల్పోయిందని కల్వకుర్తి, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యేలు గుర్కా జైపాల్ యాదవ్, గువ్వల బాల్‌రాజ్ లు ఆరోపించారు. అన్ని వర్గాల ప్రజలను మోసగించి అధికారం చేపట్టిన రేవంత్ సర్కార్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదన్నారు. కడ్తాల మండలం ఎక్వాయిపల్లిలో బుధవారం వారు పర్యటించారు. డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌తో కలిసి పీఏసీఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న ధాన్యం కొనుగోళ్లను పరిశీలించారు. అకాల వర్షాల నేపథ్యంలో కొనుగోళ్లు వేగవంతం చేసి రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను అన్ని విధాలా మోసగించిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులు స్థానిక ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పక తప్పదన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే రైతులకు మేలు జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్‌కోతలు కూడ మొదలయ్యాయన్నారు. వడగండ్ల వానకు పంటలు దెబ్బతిని నష్టపోయినవారిని ఆదుకోవాలని, ఎకరాకు రూ.30వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ వీరయ్య, మాజీ సర్పంచ్ నర్సింహగౌడ్, నాయకులు బాలయ్య, యాదయ్య, మహేశ్, వీరేశ్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

ఆమనగల్లు : ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని ఆమనగల్లు వ్యవసాయ శాఖ ఏడీఏ శోభారాణి కోరారు. కొనుగోలు కేంద్రం వద్ద ఇబ్బందులు కలుగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌లోని కొనుగోలు కేంద్రాన్ని బుధవారం శోభారాణి సందర్శించారు. తూకాలను, ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టార్పాలిన్లు అందుబాటులో ఉండేలా చూడాలని కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి వెంకటరెడ్డి ఆదేశించారు. ఇన్‌చార్జి ఏవో అరుణకుమారి, ఏఈవోలు శ్రీనాథ్, మీనాక్షి ఉన్నారు.

వీరభద్రేశ్వరుడి జాతర ప్రారంభం

తాండూరురూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరారెడ్డిపల్లిలో వీరభద్రేశ్వరస్వామి ఆలయ జాతర బుధవారం ప్రారంభమైంది. గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు పురుషోత్తంరెడ్డి కలశ పూజ నిర్వహించారు. ప్రధానార్చకుడు జగదీశ్వరస్వామి స్వామివారికి పూజలు, అభిషేకం, అలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం ఉదయం 5గంటలకు పల్లకిసేవ, అనంతరం అగ్నిగుండ ప్రవేశాలు, ఉమామహేశ్వరుల కల్యాణం, సాయంత్రం రథోత్సవ కార్యక్రమాలుంటాయని తెలిపారు.



కలశ పూజ నిర్వహిస్తున్న భక్తులు

ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి

- శంషాబాద్ డీసీపీ రాజేశ్



పాపిలోన్ డివైస్‌ను పరీక్షిస్తున్న డీసీపీ రాజేశ్

ఆమనగల్లు, మే 14(ఆంధ్రజ్యోతి): ఫిర్యాదులపై సత్వరమే స్పందించి పోలీసు వ్యవస్థ పట్ల ప్రజలకు మరింత నమ్మకాన్ని, గౌరవాన్ని పెంపొందించాలని శంషాబాద్ డీసీపీ రాజేశ్ పోలీసు అధికారులు, సిబ్బందికి సూచించారు. పెట్రోల్ మొబైల్ సిబ్బంది 100 డయల్ ఫిర్యాదులను స్వీకరించి త్వరగా సంఘటనా స్థలానికి చేరుకొని నేరాల నియంత్రణకు, సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలన్నారు. కడ్తాల పోలీస్‌స్టేషన్‌ను బుధవారం డీసీపీ ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు, పరిసరాలు, స్టేషన్ నిర్వహణను పరిశీలించారు. ఆవరణలో ఉన్న వాహనాలను తనిఖీ చేశారు. సీఐ గంగాధర్, ఎస్సై వరప్రసాద్‌తో సమావేశమయ్యారు. పెండింగ్ కేసులు, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు, రోడ్డు ప్రమాదాలు, సీసీ కెమెరాల ఏర్పాటు, సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కార్యక్రమాలు, తదితర విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులు సత్వరంగా పరిష్కారమయ్యేలా చూడాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించేది లేదన్నారు. ఈ సందర్భంగా పాపిలోన్ డివైస్‌ను పరీక్షించారు.

క్రీడాకారులు రికార్డులు నెలకొల్పాలి



ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల క్రీడాకారులు

శామీర్‌పేట, మే14 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో గెలిచిన నెట్‌బాల్ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడాపోటీల్లో ఉత్తమ రికార్డులు నెలకొల్పాలని తెలంగాణ రాష్ట్ర నెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి శిరీషరాణి పిలుపునిచ్చారు. బుధవారం శామీర్‌పేట మినీ స్టేడియంలో జిల్లా స్థాయిలో నెట్‌బాల్ పోటీలను శిరీషరాణి ప్రారంభించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్ జిల్లాలకు చెందిన దాదాపు వంద మంది నెట్‌బాల్ క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. ఈ పోటీల్లో గెల్చిన క్రీడాకారులను అసోషియేషన్ సభ్యులు రాష్ట్రస్థాయిలో నెట్‌బాల్ పోటీలకు ఎంపిక చేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన 48మంది క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. 8వ జాతీయ సబ్ జూనియర్స్ చాంపియన్‌షిప్ క్రీడాపోటీలను ఈ నెల 15 నుంచి 18 వరకు జనగామలో నిర్వహిస్తామని శిరీషరాణి తెలిపారు. ఎంపికలను అసోషియేషన్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కార్యదర్శులు ప్రకాశ్, సంగీత, నెట్‌బాల్ సీనియర్ ప్లేయర్ ఓంప్రకాశ్, కోచ్‌లు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

రింగ్ రోడ్డు నిర్వాసితులకు పరిహారమివ్వాలి

తాండూరు, మే 14(ఆంధ్రజ్యోతి): బైపాస్ రింగ్ రోడ్డు కోసం ప్రభుత్వం భూములు, ప్లాట్లు తీసుకొని నిర్వాసితులకు పరిహారం ఇవ్వడం లేదని సీపీఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. మార్కెట్ రేటుకు మూడింతల పరిహారం ఇవ్వకుండా అన్యాయం చేశారన్నారు. తాండూరులో బైపాస్ రింగ్ రోడ్డు కోసం కోకట్, అంతారం తదితర గ్రామాల్లో భూములు, ప్లాట్లు తీసుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం నోటీసులు ఇవ్వకుండా భూములను లాక్కుంటోందన్నారు. నిర్వాసితులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పరిహారం కోసం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద 19న ధర్నా చేస్తామని హెచ్చరించారు.



పాఠశాల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న రాజేశ్‌రెడ్డి

ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతమే ధ్యేయం

బొంరాస్‌పేట్, మే 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం బొంరాస్‌పేట్, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో రూ.90లక్షల కడా నిధులతో పాఠశాలల నిర్మాణాలకు నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిములుగౌడ్, రాంచంద్రారెడ్డి, వెంకట్రాములుగౌడ్, కృష్ణ, మల్లికార్జున్, నర్సిములునాయుడు, భీమయ్య పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందిస్తున్న ఆంజనేయులు

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు ఆర్థిక భరోసా

కులకచర్ల, మే 14(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పేదల వైద్య ఖర్చుల కోసం ప్రభుత్వం అందిస్తున్న సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపకరిస్తోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. బుధవారం ముజాహిద్‌పూర్‌లో సార సుగుణమ్మకు రూ.24వేల చెక్కును అందించారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పార్టీలకతీతంగా సీఎంఆర్ఎఫ్ మంజూరు చేయిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు షర్ఫొద్దీన్, సోమలింగం, చంద్రయ్య, భాస్కర్ పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న మాజీ జెడ్పీటీసీ మధుకర్

జాతర కోసం విరాళం అందజేత

మర్పల్లి, మే 14(ఆంధ్రజ్యోతి): వీర్లపల్లిలో పోచమ్మ, దుర్గమాత ఆలయాల్లో నవగ్రహాల ప్రతిష్ఠాపన, జాతర కోసం మాజీ జెడ్పీటీసీ మధుకర్ బుధవారం రూ.51వేల విరాళాన్ని ఆలయ కమిటీకి అందించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు దైవ చింతనను అలవర్చుకొని మానసిక ప్రశాంతత పొందాలని కాంక్షించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

బొంరాస్‌పేట్, మే 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని ఏర్పుమళ్ల పాఠశాల హెచ్ఎం వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం తోటి ఉపాధ్యాయులతో ఏర్పుమళ్ల, సీత్యానాయక్, గంజిపల్లి తండాల్లో ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పించారు. ఉచిత పుస్తకాలు, స్కూల్ డ్రెస్సులు, మధ్యాహ్నం భోజనం వంటి సదుపాయాలను ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ స్కూల్‌లోనే చేర్పించాలని తెలపారు. కార్యక్రమంలో టీచర్లు కిషన్, సర్దార్, ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

పెద్దేముల్, మే 14 (ఆంధ్రజ్యోతి): 108 అంబులెన్స్‌లో ఓ గర్భిణి ప్రసవించిన ఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. ఇందూర్‌కు చెందిన బాలమణికి పురిటినొప్పులు రావడంతో అంబులెన్స్‌కు ఫోన్‌చేశారు. తాండూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా బాలమణికి నొప్పులు ఎక్కువయ్యాయి. ఈఎంటీ నర్సింహులు ఆమెకు నార్మల్ డెలివరీ చేశారు. ఈఎంటీకి పైలట్ జావెద్ సహకరించాడు. అనంతరం తల్లీశిశువులను ఆసుపత్రికి తరలించారు.



శిశువును కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఈఎంటీ నర్సింహులు

కలిసుంటే కలదు సుఖం!

రోజురోజుకూ విచ్ఛిన్నమవుతున్న ఫ్యామిలీలు

కనుమరుగవుతున్న అనుబంధాలు



ఆనందాలకు వేదిక ఉమ్మడి కుటుంబాలు

నేడు ప్రపంచ కుటుంబ దినోత్సవం

రంగారెడ్డి అర్బన్/వికారాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కుటుంబంలో తాత, నానమ్మ, పెద్దనాన్న, పెద్దమ్మ, పిన్ని, బాబాయ్, అమ్మ, నాన్న అక్క చెల్లి, తమ్ముడు, వదిన, బావగారు, మరిది, మరదలు, అబ్బో ఎన్ని బాధ్యాలు.. ఎన్ని ఎల్లికలు... ఇంట్లో ఎవరికి ఏ చిన్న సమస్య వచ్చినా తమదిగా బావించి ఆ చిక్కుముడిని విప్పేవారు. కుటుంబంలో తాత, ముత్తాత మొదలు వారి పిల్లలు, వారి పిల్లల పిల్లలు ఇలా మూడు నుంచి నాలుగు తరాల ఉమ్మడి కుటుంబంలో ఉండేవి. ఇంట్లో పెద్దకు అందరూ గౌరవం ఇస్తూ ఆయన మాటే వినేవారు. ఆ కుటుంబాలు పెద్దల సంరక్షణలో పిల్లలు ఆనందంగా ఉండేవారు. కష్టసుఖాలు సమానంగా పంచుకునేవారు. మారుతున్న కాలానుగుణంగా మారుతున్న జీవన శైలిలో కనీసం భార్య భర్తలు మాట్లాడుకోవడానికి సమయం ఉండటం లేదు. అమ్మా నాన్నలంటే మోయలేని బరువులుగా మారాయి. మనిషి అవసరాలకు అనుగుణంగా కుటుంబాలు కుచించుకుపోతున్నాయి. ఉమ్మడి కుటుంబాలు ఆధునిక ప్రపంచంలో చిన్న కుటుంబాలుగా మారాయి.

సమాజంలో కుటుంబ వ్యవస్థ బలహీనపడుతున్న నేపథ్యంలో కుటుంబాల విలువలను తెలిపేందుకు కుటుంబ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. గతంలో మాదిరిగా ప్రస్తుతం ఉమ్మడి కుటుంబాలు ఉండటం లేదు. ఈ పరిణామం వల్ల ఒంటరితనం పెరిగిపోయి వ్యసనాలకు బానిసలు కావడం, పట్టించుకునేవారు లేక పోవడంతో మహిళలపై పనిభారం పెరిగి వారి ఆరోగ్యం దెబ్బతినడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. దీని కారణంగా సమాజంలో జరిగే దుష్పరిణామాలు గ్రహించి ఐక్యరాజ్య సమితి కుటుంబ వ్యవస్థను పటిష్టం చేయడం కోసం 1993 మే 15ను అంతర్జాతీయ కుటుంబ దినోత్సవంగా ప్రకటించింది. అప్పటి నుంచి ఈ రోజును వేడుకగా జరుపుకోవడం ప్రారంభించారు.

అహం, స్వార్థంతో వేరు కుటుంబాలు

సుఖ దుఃఖాలకు సంతోషాలకు వేదికగా నిలిచిన కుటుంబ వ్యవస్థ నేడు అహానికి, వ్యక్తి స్వార్థానికి కేంద్ర బిందువుగా మారింది. కలిస్తే పలకరింపులకు బదులుగా చీదరింపులు, పగలు ప్రతీకారాలకు వేదికలుగా మారుతున్న పరిస్థితులు కనిపిస్తోన్నాయి. ఉమ్మడి కుటుంబం అంటే ఇష్టంలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆర్థికపరమైన అంశాలకు ఉన్న విలువ, మానవ సంబంధాలకు ఇవ్వడం లేదు. కుటుంబాల మధ్య సంబంధాలన్నీ ఆర్థికపరమైన అంశాల చుట్టూ తిరుగుతున్నాయి. ఇవి కుటుంబాల్లో అశాంతికి, కుటుంబాల విచ్ఛిన్నం కావడానికి ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. ప్రస్తుతం వయోవృద్ధుల సంక్షేమం పెద్ద సమస్యగా మారింది. వయోవృద్ధులు ఆనందంగా జీవించే పరిస్థితులు లేకుండా పోయాయి. జీవితాంతం కుటుంబ అభివృద్ధి కోసం కష్టపడి చివరి దశలో కుటుంబాలతో కలిసి సంతోషంగా ఉందామనుకున్న వృద్ధులకు ఆ అవకాశమే లభించడం లేదు. తల్లిదండ్రును చూసుకునే తీరిక లేక ఎంతోమంది వృద్ధాశ్రమాల్లో ఉంచుతున్నారు. కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం కాకుండా కాపాడుకుంటూ, ఉమ్మడి కుటుంబాల ప్రాధాన్యతను గుర్తించాల్సిన అవసరం ఎంతైన ఉందని పేర్కొంటున్నారు.

ఆదర్శంగా శశికళ కుటుంబం

జిల్లేడు చౌదరిగూడ మండలం, రావిర్యాల గ్రామానికి చెందిన దివంగతులు శర్వలింగంకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య పరమేశ్వరికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులున్నారు. పరమేశ్వరి 1985లో చనిపోయింది. తర్వాత శర్వలింగం శశికళను వివాహం చేసుకున్నాడు. ఆమెకు ఇద్దరు కుమారులు జన్మించారు. శర్వలింగం మొదటి భార్య సంతానాన్ని శశికళ సాకింది. సొంత పిల్లలతో సమానంగా ఏ లోటు రాకుండా పెంచి పెద్ద చేసింది. పెద్ద కొడుకు శ్రీశైలం, రెండో కుమారుడు రవికుమార్, మూడో కుమారుడు సతీష్ వివాహాలు జరిపించింది. నాలుగో కుమారుడు మహేష్ పెళ్లి చేయాల్సి ఉంది. పెళ్లయిన కొడుకులకు ఒక్కొక్కరికీ ఇద్దరు పిల్లలున్నారు. నిరుపేద కుటుంబం. పెద్ద కుమారుడు కిరాణాషాపు, రెండోవాడు జీరాక్స్, మూడో కుమారుడు ప్రైవేట్ ఉద్యోగం, నాల్గో కుమారుడు ప్రభుత్వ టీచర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ బాధ్యతలన్నీ తల్లి శశికళనే చూసుకుంటుంది. అత్తమ్మ సారథ్యంలో కుటుంబ నిర్వహణ, బాధ్యతల్లో కోడళ్లు, కొడుకులు పాలుపంచుకుంటూ అందరూ కలిసిమెలసి, అన్యోన్యంగా సుఖ సంతోషాలతో జీవిస్తూ తోటి వారికి ఆదర్శంగా నిలుస్తున్నారు.



సంతోషంగా ఉన్నాం

అమ్మ.. అంటూ కొడుకులు, అమ్మమ్మ, నాయనమ్మ అంటూ పిల్లలు, అత్తమ్మ అంటూ ఆప్యాయంగా పలికరించే కోడళ్లు ఉన్నారు. చిన్నబ్బాయి పెళ్లి చేయాల్సి ఉంది. అందరూ పెళ్లిళ్లు చేశాను. మనవడు, మనవరాళ్లతో సంతోషంగా ఉన్నాను.

-శశికళ

కలిసి ఉంటే కష్టం దరిచేరదు



వికారాబాద్‌లో మ్యాడం కుటుంబం

కలిసి ఉంటే కష్టం దరిచేరదని చిన్నప్పుడు మా నాన్న చెప్పిన మాట మా అన్నదమ్ముళ్ల మనస్సులో అలాగే ఉండిపోయింది. మా నాన్న మ్యాడం క్రి.శే అంజయ్య, అమ్మ సరస్వతికి మేము తొమ్మిది మంది సంతానం. అందులో ఏడుగురం అన్నాదమ్ముళం మ్యాడం కృష్ణ, లక్ష్మీనారాయణ శ్రీనివాస్, వేణుగోపాల్, వెంకటేశ్, రాము, గౌరీశంకర్, చెల్లెలు లక్ష్మీ, పద్మ ఉన్నాం. ఇద్దరు అన్నలు వృత్తి రీత్యా ఒకరు పరిగిలో, ఒకరు హైదరాబాద్‌లో ఉంటున్నా మేమంతా కలిసే ఉన్నాం. ప్రస్తుతం ఐదుగురు అన్నదమ్ముళం ఒకే ఇంటిలో ఉంటూ వ్యాపారాలు చేసుకుంటూ ఆనందంగా ఉన్నాం. మా పిల్లల పెళ్లిళ్లు కూడా చేశాం. వారు కూడా మాతోనే ఉంటారు. కుటుంబం అంతా ఒక్క దగ్గర ఉంటే ఒక ధైర్యం. ఒకరిగా ఉంటే ఎన్నో సమస్యలు వస్తాయి. ఉమ్మడిగా ఉంటే సొసైటీలో గౌరవం ఉంటుంది. ప్రస్తుతం ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవుతున్నాయి. ఒకసారి పిల్లలు ఆలోచించాలి. డబ్బు కన్నా బంధాలకు విలువ ఇచ్చినప్పుడు ఆ డబ్బు కూడా మన వద్దకే వస్తుందని..

- మ్యాడం వెంకట్, ఐదో కుమారుడు, వికారాబాద్

కాంగ్రెస్ పార్టీలో పదవుల భర్తీ

17వరకు తుక్కుగూడ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణ.. మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం ఇన్‌చార్జి కేఎల్లార్



మహేశ్వరం, మే 14(ఆంధ్రజ్యోతి): త్వరలో మహేశ్వరం నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన పదవులు భర్తీ చేయనున్నామని, పదవులు ఆశించే వారు ఈనెల 17వరకు దరఖాస్తులను తుక్కుగూడ పార్టీ కార్యాలయంలో అందజేయాలని మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ తెలిపారు. ఈమేరకు బుధవారం తుక్కుగూడలోని కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గాన్ని పార్టీ పరంగా నాలుగు బ్లాకులుగా విభజించామని.. జీహెచ్ఎంసీలోని సరూర్‌నగర్, ఆర్కేపురం డివిజనల్లను కలుపుకొని మొదటి బ్లాకు, మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పోరేషన్లను కలుపుకొని రెండవ బ్లాకు, తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీలను కలుపుకొని మూడవ బ్లాకు, మహేశ్వరం, కందుకూరు మండలాలను కలుపుకొని నాల్గవ బ్లాకుగా విభజించామన్నారు. ప్రజల కోసం, పార్టీ బలోపేతానికి పని చేయాలనుకొని ముందుకెళ్లేవారు పార్టీ అధ్యక్ష బ్లాక్, డివిజన్, మండల, గ్రామ శాఖల అధ్యక్షులతో పాటు ఇతరత్రా పదవులను ఆశించే నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గాన్ని నాలుగు బ్లాకులుగా విభజించిన విషయాన్ని గమనించి పదవుల పేర్లు నమోదు చేస్తూ సందిత దరఖాస్తు ఫారాన్ని అందించాలని సూచించారు. ఈనెల 17వరకు పార్టీ కార్యాలయంలో అందజేయాలన్నారు. పార్టీ ఆదేశాలను కాదని పైరవీలతో ఎవరు ముందుకెళ్లినా ఎలాంటి పదవులు రావనే విషయాన్ని గమనించాలన్నారు. పార్టీకోసం పనిచేసే వారికి పదవులు తగిన సమయంలో తప్పకుండా వస్తాయని కేఎల్లార్ తెలిపారు.



ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే యాదయ్య, మధుసూదన్‌రెడ్డి

మహిళలు స్వశక్తితో ఎదగాలి

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య
- ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం

శంకర్‌పల్లి, మే 14(ఆంధ్రజ్యోతి): మహిళలు స్వశక్తితో ముందుకు సాగాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. శంకర్‌పల్లి మున్సిపల్ కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తూ ఉపాధి అవకాశాలను మెరుగు పరుచుకోవాలని సూచించారు. మహిళా సాధికారికత కోసం ప్రతి ఒక్కరూ చేయూతనందించాలన్నారు. మెప్మా పీడీ మల్లేశ్వరి, మున్సిపల్ కమిషనర్ యోగేష్, మేనేజర్ అంజన్‌కుమార్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ చంద్రమోహన్, ఏఈ సాయికిరణ్, మెప్మా ఏడీఎంసీ ఉమేష్, టీఎంసీ వినోద్. మోకిల సొసైటీ సీఈవో వేణు, నాయకులు ప్రవీణ్ కుమార్, పాండురంగారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రఘునందన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారం లబ్ధిదారుల ఎంపిక



శేఖాపురం ఆంజనేయులు

తాండూరు రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం స్కీంలకు లబ్ధిదారుల ఎంపికను అధికారులు గ్రామసభలు పెట్టకుండానే పైరవీకారులు చెప్పినట్టే చేస్తున్నారని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు శేఖాపురం అంజనేయులు ఆరోపించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లను కాంగ్రెస్ నాయకులు సూచించిన వారికే కేటాయిస్తున్నారని అన్నారు. రాజీవ్ యువ వికాసం స్కీంను పార్టీ కార్యకర్తలకే ఇస్తున్నారని తెలిపారు. అర్హులైన పేదలు నష్టపోతున్నారని, ఇలా కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఫైనల్లో సాత్విక్‌రెడ్డి ద్వయం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ మిక్స్‌డ్ డబుల్స్‌లో సాత్విక్ రెడ్డి-రాధిక శర్మ జోడీ ఫైనల్లో ప్రవేశించి పతకం ఖాయం చేసుకున్నాయి. బుధవారం నగరంలోని గుత్తా జ్వాల బ్యాడ్మింటన్ అకాడమీలో జరిగిన సెమీస్ పోరులో సాత్విక్ (తెలంగాణ)-రాధిక (పంజాబ్) 21-12, 21-9తో సూర్య-అమృత (కర్ణాటక)పై గెలిచి తుది పోరుకు అర్హత సాధించారు. పురుషుల డబుల్స్ క్వార్టర్స్‌లో సిద్ధార్థ్ (తెలంగాణ)-గౌస్ షేక్ (ఆంధ్రప్రదేశ్) జోడీ 21-16, 15-21, 19-21తో దీప్ రామ్-ప్రతీక్ (మహారాష్ట్ర) ద్వయం చేతిలో ఓడింది. మహిళల డబుల్స్ క్వార్టర్స్‌లో వెన్నెల (తెలంగాణ)-నవ్య (ఆంధ్రప్రదేశ్) జంట 21-15, 17-21, 18-21తో దివ్య (కర్ణాటక)-బరుణి (హరియాణా) జోడీ చేతిలో పరాజయం పాలైంది.

లారీలు రావు.. వడ్లు పోవు

కొనుగోలు కేంద్రాల్లో అన్నదాతల అవస్థలు

చౌడాపూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించిన రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. లారీలు రాకపోవడంతో రోజుల తరబడి ఎదురుచూస్తున్నారు. అకాల వర్షాలతో ధాన్యాన్ని కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. చౌడాపూర్ మండలంలో ఏర్పాటు చేసిన ఐదు కేంద్రాల వద్ద ధాన్యం నిల్వలు పేరుకుపోయాయి. కేంద్రాలను ప్రారంభించి 18 రోజులు గడుస్తున్నా లారీలు రాకపోవడంతో రైతులు ధాన్యం కుప్పల వద్దే పడిగాపులు కాస్తున్నారు. తరుచూ కురుస్తున్న వర్షాలతో ధాన్యం తడుస్తుందేమోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కేంద్రాలకు లారీలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



లారీలు రాకపోవడంతో కేంద్రం వద్ద ధాన్యం నిల్వలు

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్



కార్మికులతో మాట్లాడుతున్న భూపాల్

ఆదిభట్ల, మే 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ పిలుపునిచ్చారు. బుధవారం ఇబ్రహీంపట్నం కేంద్రంలోని ఇంటర్నేషనల్ కంపెనీ వైట్ గోల్డ్ కార్మికులతో మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికుల హక్కులను కాలరాసేందుకు ప్రయత్నం చేస్తుందని, దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతుందన్నారు. 8 గంటల పని విధానాన్ని రద్దుచేసి 12 గంటల పని విధానాన్ని అమలు చేస్తుందన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.జగదీష్, జిల్లా సహాయ కార్యదర్శి స్వప్న, ఇబ్రహీంపట్నం కన్వీనర్ చింతపట్ల ఎల్లేష్, సీఐటీయూ నాయకులు పోచమోని కృష్ణ, వీరేశం, శాంతమ్మ, పద్మ, బాలమణి, సుజాత తదితరులు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, అధికారి గణపతిరెడ్డి

పరిగిలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్

పరిగి, మే 14(ఆంధ్రజ్యోతి): పరిగిలో రూ.200ల కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పరిగి పట్టణ పరిధి విద్యారణ్యపురిలో స్కూల్ నిర్మాణానికి టీజీఈడబ్ల్యూఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ గణపతిరెడ్డితో కలిసి బుధవారం స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని హంగులతో యూనివర్సిటీని తలపించేలా భవనాన్ని నిర్మిస్తామన్నారు. ఇందుకు 20ఎకరాల స్థలాన్ని సేకరిస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తోందని తెలిపారు. పేదవిద్యార్థులకు కార్పొరేట్ తరహా విద్యనందిస్తామన్నారు. విద్యాణ్యపురిని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పార్థసారథి, ఏఎంసీ చైర్మన్ బి.పరశురాంరెడ్డి, వైస్ చైర్మన్ అయూబ్, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, పార్టీ పట్టణాధ్యక్షుడు ఇ.కృష్ణ, మత్స్యశాఖ కార్యదర్శి అంజనేయులు, పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.చిన్ననర్సింహులు, శ్రీనివాస్, సర్వర్, అన్వర్ పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం

ఘట్‌కేసర్ రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): పోచారం పరిధి వెంకటాపూర్‌లోని బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రథోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ అనంతరం రథోత్సవాన్ని ప్రారంభించారు. గ్రామ వీధుల్లో రథోత్సవం కొనసాగింది. ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సత్తయ్యయాదవ్, మెంబర్లు సభ్యులు అంజనేయులు, వెంకటేష్, లావణ్య, సుధాకర్, ఈవో భాగ్యలక్ష్మి, పూజారి వినయ్‌శర్మ, నాయకులు వేణుగోపాల్, బాల్‌రాజ్, శ్రీనివాస్, వెంకటేష్‌గౌడ్, రామారావు, జంగయ్య పాల్గొన్నారు.



బాలాజీ వేంకటేశ్వరస్వామి రథోత్సవంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి

డిస్పెన్సరీతో తొలగిన ఇక్కట్లు

- స్థానికంగానే ఆర్టీసీ కార్మికులకు వైద్యం
- వికారాబాద్‌లో ఆర్టీసీ ఆస్పత్రి ఏర్పాటు
- వెయ్యి మందికిపైగా సంస్థ కార్మికులు, ఉద్యోగులు, కుటుంబాలకు ప్రయోజనం



వికారాబాద్ బస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన డిస్పెన్సరీ

వికారాబాద్, మే 14(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఆర్టీసీ కార్మికులు ఎంతోకాలంగా కోరుకున్న ఉచిత వైద్య సేవలు వికారాబాద్‌లో అందుబాటులోకొచ్చాయి. ఇప్పటి వరకు కార్మికులు ఏ ఆరోగ్య సమస్య వచ్చినా నగరంలోని తార్నాకలో గల ఆర్టీసీ ఆస్పత్రికి వెళ్లేవారు. తాండూరు, వికారాబాద్, పరిగి డిపోల్లోని ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు వైద్య సేవల కోసం నగరానికి వెళ్లాల్సి వచ్చేది. తార్నాక ఆర్టీసి ఆసుపత్రికి రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి వైద్యం కోసం కార్మికులు వస్తుంటారు. ఈ క్రమంలో అక్కడకు వెళ్లి వైద్య సేవలు పొందడం జిల్లాలోని ఆర్టీసీ కార్మికులకు ఇబ్బందికరంగా ఉండేది.

ఎట్టకేలకు కోరిక సాకారం...

వికారాబాద్‌లో ఆర్టీసీ డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలని గత 15సంవత్సరాలుగా డిమాండ్ చేస్తున్నారు. కార్మికుల కోరిక మేరకు సానుకూలంగా స్పందించిన యాజమాన్యం వికారాబాద్‌లో డిస్పెన్సరీ ఏర్పాటు చేసింది. పట్టణంలోని బస్‌స్టేషన్‌పై డిస్పెన్సరీ ఏర్పాటు చేశారు. డాక్టర్, స్టాఫ్‌నర్స్, ఫార్మాసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, ఇతర వైద్య సిబ్బందిని నియమించారు. వికారాబాద్, తాండూరు, పరిగి డిపోల డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్, షెడ్యూల్ కార్మికులు, చార్జ్‌డ్యూటీ, అడ్మినిస్ట్రేషన్, ఇతర విభాగాల ఉద్యోగులు వెయ్యి మంది, వారి కుటుంబ సభ్యులకు ఇక్కడ ఉచిత వైద్య సేవలు పొందుతారు. రోజూ అన్ని పరిధిలోని 15 నుంచి 35 మంది వరకు ఉద్యోగులు, కార్మికులు, వారి కుటుంబ సభ్యులు డిస్పెన్సరీలో వైద్య సేవలు పొందుతున్నారు.

అందుబాటులో పలు పరీక్షలు

ల్యాబ్‌లో రక్త పరీక్షలు, థైరాయిడ్, కొలెస్ట్రాల్, ఈసీజీ వంటి పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. అత్యవసర వైద్యం అవసరమైన వారికి ప్రథమ చికిత్స అందించి తార్నాక ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నారు. వికారాబాద్‌లో ఆర్టీసీ డిస్పెన్సరీ ఏర్పాటుతో జిల్లాలో ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులకు దూరభారం తగ్గింది. స్థానిక వైద్య సేవలతో సౌకర్యంగా ఉంది.


డిస్పెన్సరీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో డీఎం అరుణ, డాక్టర్ నిషాసింగ్, వైద్య సిబ్బంది

సిబ్బందికి, కుటుంబాలకు ప్రయోజనకరం



వికారాబాద్‌లో డిస్పెన్సరీ ఏర్పాటుతో ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులకు స్థానికంగానే వైద్యసేవలు అందుతున్నాయి. దూరాభారం తగ్గి వారికి ప్రయోజనం కలుగుతోంది. వికారాబాద్, పరిగి, తాండూరు డిపోల్లో పనిచేసే ఆర్టీసీ సిబ్బందికి, వారి కుటుంబాలకు ఇక్కడే వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. వైద్య పరీక్షలతో పాటు మందులు ఉచితంగా ఇస్తున్నారు.

- సుదర్శన్, కంట్రోలర్, వికారాబాద్

చాలా కాలంగా ప్రయత్నం



వికారాబాద్‌లో ఆర్టీసీ డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలని చాలా కాలంగా ప్రయత్నం చేశాం. ఉన్నతాధికారులకు పలు మార్లు వినతిపత్రాలు ఇచ్చాం. తార్నాక ఆసుపత్రికి వెళ్లాలంటే కార్మికులు ఎన్నో ఇబ్బంది పడేవారు. అనారోగ్యంతో ఉన్న వారు గంటల తరబడి ప్రయాణం చేయలేక ఇక్కట్లు పడ్డారు. ఉన్నతాధికారుల కృషితో పాటు వికారాబాద్ డిపో మేనేజర్ అరుణ చొరవతో ఎట్టకేలకు డిస్పెన్సరీ ఏర్పాటైంది. వైద్య సేవలు ఆర్టీసీ కార్మికులకు అందుబాటులోకి వచ్చాయి.

- గోపాల్, బస్‌పాస్ కౌంటర్ ఇన్‌చార్జి, వికారాబాద్


యూరియా అధిక వాడకంతో భూసారానికి నష్టం


కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త టి.లక్ష్మణ్

కొడంగల్ రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): రైతులు పంటల సాగులో అధిక యూరియా వాడితే భూసారం తగ్గుతుందని శాస్త్రవేత్త టి.లక్ష్మణ్ తెలిపారు. బుధవారం రుద్రారం రైతు వేదికలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో ఆయన అవగాహన కల్పించారు. అధిక యూరియా వాడకంతో నేల సహజ స్వభావాన్ని కోల్పోయి ఉత్పాదకతపై ప్రతీకూల ప్రభావం పడుతుందన్నారు. విత్తనాలు, ఎరువుల కొనే సమయంలో బిల్లు తప్పక తీసుకోవాలని, నకిలీలతో పంటనష్టం సంభవిస్తే బిల్లులతోనే పరిహారం పొందే అవకాశం ఉంటుందన్నారు. అధిక దిగుబడులకు, చీడపీడల నివారణకు పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలన్నారు. అలాగే అధిక సాంద్రత పత్తిసాగులో యాజమన్యా పద్ధతులను వివరించారు. తాండూర్ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త టి.రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులు రసాయన ఎరువులు తగ్గించి సేంద్రీయ ఎరువుల వాడకాన్ని పెంచాలన్నారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్, గ్రామస్తులు ఆనందరెడ్డి, సాయిలు, హన్మయ్య, వెంకటయ్యగౌడ్, ఏవో తులసి, ఏఈవోలు శ్రీపతిరెడ్డి, సుమ, పావని, అశ్విని, రాజు, దేవేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు జ్ఞాపికల అందజేత

ఘట్‌కేసర్, మే 14 (ఆంధ్రజ్యోతి): రాక్‌వుడ్స్ ఇంటర్‌నేషనల్ పాఠశాల విద్యార్థులు సీబీఎస్ఈ టెన్త్, ఇంటర్ ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. స్కూల్ చైర్మన్ రామానాయుడు మాట్లాడుతూ.. టీచర్ల, విద్యార్థుల కృషితో మంచి ఫలితాలను సాధించామన్నారు. నలుగురు విద్యార్థులు 95 శాతం నుంచి 97శాతం మార్కులు, మరో 25 మంది 90శాతం మార్కులు సాధించారని తెలిపారు.



యాజమాన్యం అందజేసిన జ్ఞాపికలతో విద్యార్థులు

వివాహానికి నాయకుల హాజరు

యాలాల, మే 14(ఆంధ్రజ్యోతి): యాలాల మండల కేంద్రానికి చెందిన మంబాపూర్ గుండప్ప కూతురు వివాహం బుధవారం జరిగింది. ఈ వివాహానికి యాలాల మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పేరి రాజేందర్‌రెడ్డి, కో-ఆప్షన్ల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు అక్బర్‌బాబ, ఏఎంసీ డైరెక్టర్ గోనెగారి శ్రీనివాస్(చిన్న), గ్రామ కమిటీ అధ్యక్షుడు మారుతి, ఉపాధ్యక్షుడు య.శేఖర్, గొల్ల యాదప్ప, సంకారం లాలు, గడ్డం బస్వరాజ్‌గౌడ్, బోయి ఉమేష్, శివ కుమార్, అమ్రేశం, రఫీక్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు.


వధూవరులను ఆశీర్వదిస్తున్న యాలాల మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు

కీసర ఇన్‌చార్జి ఎంఈవోగా జమదగ్ని నియామకం



కీసర, మే14(ఆంధ్రజ్యోతి): కీసర మండల ఇన్‌చార్జి విద్యాధికారిగా జమదగ్ని నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం ఉతర్వులు జారీ చేసింది. గత కొన్నేళ్లుగా కీసర మండల విద్యాధికారిగా విధులు నిర్వహించిన శశిధర్ ఇటీవల పదవి విరమణ పొందారు. ఈ సందర్భంగా రాంపల్లి గెజిటెడ్ ప్రధానోపాధ్యాడిగా విధులు నిర్వహిస్తున్న జమదగ్నికి కీసర మండల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ విద్యా శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

'ఇందిరమ్మ' నిర్మాణాలను వేగవంతం చేయాలి


ఊటుపల్లిలో ఇళ్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో గమ్యా

దోమ, మే 14 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో గమ్యా అన్నారు. బుధవారం మండలంలోని ఊటుపల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను పరిశీలించారు. అర్హులైన లబ్ధిదారులకు దక్కేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆయనతో కార్యదర్శి, గ్రామస్తులు ఉన్నారు.

చౌడాపూర్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఎంపీడీవో సోమలింగం అన్నారు. చౌడాపూర్ మండలంలో సర్వే నిర్వహించారు. చాకల్‌పల్లిలో 25 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా ఎంపీడీవో సోమలింగం, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శేఖర్, రాజునాయక్, సుధాకర్, నర్సిము లు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


సర్వే నిర్వహిస్తున్న ఎంపీడీవో సోమలింగం

గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ మృతి బాధాకరం : ఎమ్మెల్యే


సందీప్ కుటుంబ సభ్యులకు ఆర్థికసాయాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఘట్‌కేసర్, మే 14 (ఆంధ్రజ్యోతి): గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ సందీప్ నక్సలైట్ల మందుపాతరలో మృతిచెందడం బాధాకరం అని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. బుధవారం ఘట్‌కేసర్‌లోని అంబేడ్కర్ నగర్‌లో గల సందీప్ నివాసానికి వచ్చిన ఎమ్మెల్యే. సందీప్ భార్య తల్లిని ఓదార్చాడు. ఈ సందర్భంగా ఆయన రూ.3లక్షల ఆర్థికసాయాన్ని అందించాడు. సందీప్ కుంటుబానికి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయాన్నారు. సందీప్ కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారం, ఇతరాలను త్వరగా వచ్చే విధంగా తనవంతు కృషి చేస్తానని ఆయన అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, జక్క వెంకట్‌రెడ్డి, మాధవరెడ్డి, బద్దం జగన్ మోహన్‌రెడ్డి, నర్సింగ్‌రావు, ఖలీల్, ధర్మారెడ్డి, అంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనుల ప్రారంభం

మర్పల్లి, మే 14(ఆంధ్రజ్యోతి): స్పీకర్ ప్రసాద్‌కుమార్ చొరవతో మండలంలోని గుర్రంగుట్ట తండాలో తాగునీటి సమస్యకు పరిష్కారం లభించిందని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్ అన్నారు. బుధవారం తండాలో తాగునీటి పైపులైన్ పనులను ప్రారంభించారు. కొన్నేళ్లుగా తండాలో ప్రజలు తాగునీటి ఎద్దడి ఎదుర్కున్నారని, స్పీకర్ చొరవతో సమస్యకు పరిష్కారం లభించిందన్నారు. రూ.9.5లక్షలతో పనులను చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సింహారెడ్డి, రఘుపతిరెడ్డి, సంతోష్, శ్రీనివాస్‌రెడ్డి, రాజు, ప్రభాకర్‌రెడ్డి, ఎస్.ప్రభాకర్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.


పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న నాయకులు

ఘనంగా బందే నవాజ్ ఉర్సు

నవాబుపేట, మే 14(ఆంధ్రజ్యోతి): నవాబుపేట మండలంలోని అక్నాపూర్‌లో ఖాజ బందే నవాజ్ ఉర్సు ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం మండలంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి దర్గాలో ప్రార్థనలు నిర్వహించారు. ఉర్సు సందర్భంగా దర్గా ప్రాంగణంలో మిఠాయి దుకాణాలు వెలిశాయి.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొడంగల్, మే 14(ఆంధ్రజ్యోతి): కొడంగల్ మండలంలో 132కేవీ విద్యుత్ లైన్, ట్రీ కటింగ్ పనుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు బుధవారం పేర్కొన్నారు. పర్సాపూర్, గుండ్లకుంట, కొండారెడ్డిపల్లి, పాత కొడంగల్ గ్రామాల్లో నేటి ఉదయం 8నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వారు తెలిపారు.

ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ర్యాలీ

మోమిన్‌పేట్, మే 14(ఆంధ్రజ్యోతి):మోమిన్‌పేట్‌లో బుధవారం ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా రాజకీయ పార్టీల నాయకులు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని బసవేశ్వర చౌరస్తా వరకు నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ- దేశం కోసం బేదాభిప్రాయాలు పక్కనబెట్టి అంతా కలిసిరావడం శుభపరిణామం అన్నారు. దేశం కోసం పోరాడిన వీర జవాన్లకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, సుభాష్‌గౌడ్, ఆశిరెడ్డి, రమేశ్, చంద్రశేఖర్, సుధాకర్‌గుప్తా, లక్ష్మిరెడ్డి, మహంత్, సంతోష్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, గ్రామస్తులు

ఫ్లై ఓవర్‌పై ట్రాక్టర్ ట్రాలీ..

- భారీగా ట్రాఫిక్ జామ్

తాండూరు, మే 14(ఆంధ్రజ్యోతి): తాండూరు-కొడంగల్ రోడ్డులోని ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై గుర్తు తెలియని వ్యక్తి ట్రాక్టర్ ట్రాలీని వదిలి వెళ్లడంతో ఆ రోడ్డులో బుధవారం గంటన్నరకు పైగా ట్రాఫిక్ జామైంది. ఈ రోడ్డు ఇరు వైపులా గంటల తరబడి వాహనాలు నిలిచిపోయాయి. వంతెన చివర కూడా మరమ్మతులు జరుగుతుండటంతో సమస్య జటిలమైంది. ట్రాలీ రాడ్ విరిగిపోవడంతోనే డ్రైవర్ ట్రాలీని వదిలివెళ్లాడని పోలీసులు తెలిపారు. మరో ట్రాక్టర్‌తో ట్రాలీని తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశామని తెలిపారు.

రక్తదానం చేసిన కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి

యాలాల, మే 14, (ఆంధ్రజ్యోతి): కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య 8వ సారి రక్తదానం చేశారు. యాలాలకు చెందిన సాయిలు గత నెల 30వ తేదీన ఆటో, కారు ఢీకొన్న ప్రమాదంలో చేతికి ఫ్రాక్చర్ అయింది. దీంతో ఆయన హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయనకు ఆపరేషన్ నిమిత్తం అత్యవసరంగా రక్తం అవసరం ఉందని వైద్యులు సూచించారు. ఈ విషయం తెలుసుకున్న మల్కయ్య ముందుకు వచ్చి రక్తదానం చేశారు.


రక్తదానం చేస్తున్న మల్కయ్య

రాజసం ఉట్టిపడేలా..

(ఐదో పేజీ తరువాయి)

వికారాబాద్ జిల్లా జడ్జి కోర్టుకు బదిలీ చేశారు. దీంతో న్యాయవాదులు, కక్షిదారులతో కోర్టు ప్రాంగణం రద్దీగా మారింది. వాహనాల పార్కింగ్‌కూ ఇబ్బందులు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో అత్యాధునిక హంగులతో కోర్టు కాంప్లెక్స్‌ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.

5.35 ఎకరాల్లో నిర్మాణం

వికారాబాద్‌లో అన్ని హంగులతో కోర్టు భవనాలను నిర్మిస్తామని, ఇందుకోసం మొదట 25ఎకరాల స్థలం కేటాయిస్తామన్న అప్పటి ప్రభుత్వం బిల్లాదాఖలాలో పదెకరాలు కేటాయించింది. అయితే ప్రభుత్వం కేటాయించిన స్థలం కక్షిదారుల రాకపోకలకు అనుకూలంగా లేదని, ప్రస్తుతం కోర్టు కొనసాగుతున్న స్థలంలోనే నిర్మించాలని ప్రభుత్వంపై బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఒత్తిడి తెచ్చారు. ప్రస్తుతం కోర్టు భవనాలు 3.01 ఎకరాల్లో ఉండగా, ఆ భవనం పక్కనే 1.02ఎకరాల్లో ఇరిగేషన్ అండ్ క్యాచ్‌మెంట్ ఏరియా(ఐఅండ్‌క్యాడ్) కార్యాలయం కొనసాగుతోంది. మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది నివాస గృహాలు 1.08 ఎకరాల్లో ఉండగా, ఆ పక్కనే జడ్జి క్వార్టర్ 0.22 ఎకరాల్లో ఉంది. జిల్లా కోర్టు కొనసాగుతున్న స్థలంతోపాటు ఐఅండ్ క్యాడ్, మండల పరిషత్ సిబ్బంది, జడ్జి నివాస గృహాలు ఉన్న 5.35ఎకరాల్లో జిల్లా కోర్టు భవన సముదాయం నిర్మించాలని బార్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. ఈ విషయంలో చొరవ తీసుకుని ప్రస్తుతం కోర్టు కొనసాగుతున్న స్థలంలోనే కొత్తగా కోర్టు భవన సముదాయాన్ని నిర్మించే విధంగా కృషి చేయాలని బార్ అసోసియేషన్ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు విజ్ఞప్తి చేసింది. కోర్టు భవనం కోసం కేటాయించిన స్థలానికి బదులుగా ఐఅండ్ క్యాడ్ కార్యాలయం కొనసాగుతున్న స్థలాన్ని కోర్టు భవన సముదాయం నిర్మాణానికి కేటాయించాలని కోరుతూ కలెక్టర్ సీసీఎల్ఏకు లేఖ రాశారు. ఆ స్థలం కోర్టు భవనానికి కేటాయిస్తే ఐ అండ్ క్యాడ్ కొత్త భవనం నిర్మించేందుకు రూ.1.54 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించారు. ఇరిగేషన్ స్థలం న్యాయ శాఖకు అప్పగించే ప్రక్రియ ప్రభుత్వ పరిశీలనలో ఉంది.


వికారాబాద్‌లో జిల్లా కోర్టు కాంప్లెక్స్

ఆకట్టుకునే ఎలివేషన్‌తో..

కోర్టు భవన సముదాయం రాజసం ఉట్టిపడేలా నిర్మించనున్నారు. తూర్పు అభిముఖంగా నిర్మించే కోర్టు భవన సముదాయం భారీ ఎలివేషన్‌తో ముఖ ద్వారం విశాలంగా ఉండేలా డిజైన్ రూపొందించారు. ముఖ ద్వారానికి ఇరువైపులా విశాలమైన భుజాలతో ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల మాదిరిగా భవన సముదాయాన్ని తీర్చిదిద్దనున్నారు. గాలి, వెలుతురు ధారాళంగా వచ్చేలా జాగ్రత్తలు తీసుకోనున్నారు. కోర్టు కాంప్లెక్స్‌ల డిజైన్‌ను ఖరారు చేసిన ప్రభుత్వం.. ఈ నిర్మాణ పనులను ఆర్అండ్‌బీ శాఖకు అప్పగించింది.

క్రైం కార్నర్

చెరువులో మునిగి బాలుడి మృతి


వినయ్ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు


వినయ్(ఫైల్)

పరిగి, మే 14 (ఆంధ్రజ్యోతి):చెరువులో ఈతకు వెళ్లిన బాలుడు నీటిలో మునిగి మృతిచెందిన ఘటన మిట్టకోడూరులో చోటు చేసుకుంది.. వివరాల్లోకి వెళ్తే.. మిట్టకోడూరుకు చెందిన ఐనాపూర్ శ్రీనివాస్, అనిత దంపతుల చిన్న కొడుకు వినయ్(10) బుధవారం స్నేహితులతో కలిసి గ్రామ చెరువు వద్దకు వెళ్లాడు. లోతుగా ఉన్న గుంతలో ఈతకు దిగిన వినయ్ మునిగిపోవడంతో స్నేహితులు బయటకు పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, గ్రామస్తులు పరుగున వచ్చి బాలుడిని వెలికి తీసినా అప్పటికే మృతిచెందాడు. కొడుకు మృతితో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు.

శివారెడ్డిపేట చెరువులో పడి వ్యక్తి ...


సుశాంత్ మంగరాజ్ (ఫైల్)

వికారాబాద్:చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాల ప్రకారం.. పట్టణ పరిధి శ్రీ సరోజ్ మైన్స్ అండ్ మినరల్స్ కంపెనీలో ఒడిశా రాష్ట్రానికి చెందిన సుశాంత్ మంగరాజ్(47) పనిచేస్తూ ఇక్కడే ఉంటున్నాడు. మంగళవారం రాత్రి నుంచి అతడు కన్పించకపోవడంతో కుటుంబ సభ్యులు, సహోద్యోగులు వెతుకగా బుధవారం మధ్యాహ్నం శివారెడ్డిపేట చెరువు నీటిలో మృతదేహాన్ని గుర్తించారు. వేటకు అలవాటు ఉన్న సుశాంత్ ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయి మృతిచెంది ఉంటాడని అతడి కుమారుడు రాకేశ్ అనుమానం వ్యక్తం చేశాడరు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ భీంకుమార్ తెలిపారు.

బావిలో యువకుడి మృతదేహం లభ్యం


బావిలో తేలిన రమేశ్ మృతదేహం

తాండూరు రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో బావిలో ఓ గిరిజన యువకుడు మృతదేహం లభ్యమైంది. ఈ సంఘటన గుంతబాస్పల్లిలో చోటు చేసుకుంది. గుంతబాస్పల్లికి చెందిన రమేశ్(33) కూలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం పనికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. ఆచూకీ లభించలేదు. బుధవారం ఉదయం గ్రామ శివారులోని బావిలో రమేష్ మృతదేహం తేలింది. అతడి మృతిపై అనుమానం ఉందని కుటుంబీకులకు కరన్‌కోట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు శవానికి తాండూరులోని ఆసుపత్రిలో పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో బాలుడి మృత్యువాత


వర్ధన్(ఫైల్)

కీసర రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ బాలుడు మృతిచెందిన సంఘటన బుధవారం కీసర మండలంలో చోటుచేసుకుం ది.ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. దమ్మాయిగూడ మున్సిపాలిటీ చీర్యాలకు చెందిన బర్లపాటి మహేశ్, మంజుల దంపతుల చిన్న కు మారుడు వర్ధన్(17) పదో తరగతి వరకు చీర్యాల ప్రభుత్వ పాఠశాలలోనే చదివాడు. అతడి తీరు నచ్చని తండ్రి నాలుగు రోజుల క్రితం మందలించాడు. ఆ రోజు నుంచి వర్ధన్ ఆచూకీ లేదు. కాగా బుధవారం కొందరు పాఠశాల ప్రాంగణంలో క్రికెట్ ఆడుతుండగా బంతి ఓ తరగతి గదిలో పడింది. బంతి కోసం వెళ్లిన వారికి దుర్వాసన రావడంతో స్థానికులకు చెప్పారు. గ్రామస్తులు వెళ్లి చూడగా వర్ధన్ సీలింగ్‌కు ఉరేసుకున్న స్థితిలో కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. వర్ధన్ నాలుగు రోజుల కిత్రమే ఉరేసుకున్నట్టు పోలీసులు భావిస్తున్నారు. అతడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

డీసీఎంను ఢీకొన్న బైక్.. యువకుడి దుర్మరణం


కార్తీక్(ఫైల్)

వికారాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): నిలిపి ఉన్న డీసీఎంను ఓ యువకుడు బైక్‌పై వేగంగా వెళ్లి ఢీకొన్న ప్రమాదంలో అతడు అక్కడిక్కడే మృతిచెందిన సంఘటన వికారాబాద్‌లో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. నవాబుపేట మండలం ఎక్‌మామిడికి చెందిన కార్తీక్ (29) కుటుంబం కొన్నేళ్ల క్రితం వికారాబాద్‌లో సరస్వతీ కాలనీలో స్థిరపడింది. కార్తీక్ మంగళవారం రాత్రి హైదరాబాద్‌కు తన బుల్లెట్‌పై వెళుతుండగా కొత్రేపల్లి సమీపంలో రోడ్డుపై నిలిచి ఉన్న డీసీఎం(టీఎస్34 టీఏ8621)ను ఢీకొట్టాడు. తల పగిలి అతడు అక్కడికక్కడే మృతి చెందా డు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్టు సీఐ భీమ్ కుమార్ తెలిపారు. ఇదిలా ఉంటే కార్తీక్ ప్రమాదం కంటే రెండు గంటల ముందు డీసీఎం, కారు(టీఎస్34 ఎఫ్4921) ఢీకొ న్నాయి. ఈ ప్రమాదంలో ప్రాణనష్టం జరుగలేదు. రెండు వాహ నాలు దెబ్బతినడంతో వాహనాలు అక్కడే విడిచిపెట్టారు. డీసీఎంను రోడ్డు మధ్యలో ఉంచడం వల్లే కార్తీక్ బైక్ ఢీకొందని స్థానికులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఇరుగ్గా ఉన్న వికారాబాద్-హైదరాబాద్ రోడ్డుపై తరచూ జరుగుతున్న ప్రమాదాలతో ఈ ప్రాంత ప్రజలు హడలెత్తిపోతున్నారు. రోడ్లతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అంటూ బిక్కుబిక్కుమంటున్నారు. ఎన్టీఆర్ చౌరస్తా మొదలుకొని బ్రిడ్జిపై శివారెడ్డిపేట చెరువు నుంచి మన్నెగూడ వరకు అదే పరిస్థితి అదే విధంగా ఉంది.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి రిమాండ్


నిందితుడు నీతులీమా

ఘట్‌కేసర్ రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని ఘట్‌కేసర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బుధావారం సీఐ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం రాయ్‌గడ్ జిల్లాకు చెందిన నీతులీమా(24) ఘట్‌కేసర్‌లోని గాంధీనగర్‌లో ఉంటూ కూలి పనిచేస్తుంటాడు. ఈ నెల 13న పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా గాంధీనగర్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో అపి సోదా చేశారు. అతడి బ్యాగ్‌లో నుంచి 1.1కిలోల గంజాయి లభ్యమైంది. గంజాయికి అలవాటు పడి ఒడిశా నుంచి గంజాయి తీసుకోచ్చి సేవించి మిగత గంజాయిని ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. నిందితుడిని బుధవారం రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కుక్కకాటుతో ఏడుగురికి గాయాలు


గాయాలైన రేణుక

పరిగి,మే 14 (ఆంధ్రజ్యోతి): కుక్కకాటుకు ఏడుగురికి గాయాలయ్యాయి. పరిగి మండలం గడిసింగాపూర్‌లో బుధవారం కుక్క స్వైరవిహారం చేసింది. పిచ్చి కుక్క గ్రామానికి చెందిన నెల్లూరి బాలరాజు, గొట్టం పెంటయ్య, గొగ్గి అమృతమ్మ, ఇద్దరు చిన్నారులు గొల్ల నిత్య, రేణుకలతోపాటు దారి గుండా వెళుతున్న మరో ఇద్దరిని కరించింది. రేణుక తలపై కొరకడంతో ఆస్పత్రికి తరలించారు.